# భగ్న ప్రేమికులు



రచన : శ్రీ కవుల ఆంజనేయ శర్మ
శ్రీ జి. ఎస్. కె. సాయిబాబా

(గత సంచిక తరువాయి)

రాత్రి పదిగంటలసమయం. నాగమణి స్లిప్పర్లు చప్పుడుచేసుకుంటూ వస్తోంది. ఆవీధిలో ఆరోజు లైను తెగిపోవడంతో గాఢాంధకారం అలుముకుంది. ప్రక్క మేడల్లోనుండి వెలుగుతున్న లైట్లకాంతికిరణాలు కొద్దిగా మార్గాన్ని చూపుతున్నాయి. నాగమణి అలా కొంత దూరం వెళ్ళేసరికి, ప్రక్కయింటి అరుగుపైనుండి ఒక ఆకారం ఆమెపైకి దూకి నోరుమూసింది. ఆ ఆకారం చేతిలోని కత్తి తళుక్కున మెరిసింది. గ్రుడ్లు ఎర్రగావున్నాయి. కత్తిని గుండెలపైవుంచి ఆ నోరును ఆ బలమైన హస్తం గట్టిగా నొక్కుతోంది. నాగమణిగింజుకుంటోంది తప్పించుకోవాలని. కానీ లాభంలేకపోయింది.

అంతలోనే ఆవీధిలోకి హెడ్ లైట్సు వెలుగుతున్న ఒకకారు దూసుకువచ్చింది. హారనుచప్పుడు వినిపిస్తోంది.

ఆ ఆకారం, చేసేపని ఆపుచేసి కంగారుగా ఆమెనెత్తుకొని, ఒక చీకటిసందులోకి పరుగెత్తి, చటుక్కున ఒకగోడకు అంటిపెట్టుకునుంది.

ఆకారు మెల్లగా సందుదగ్గరకు వచ్చేసరికి, అందులో వున్న రాజాదృష్టి అప్రయత్నంగా ఆ చీకటిసందువైపు పడింది. అక్కడేదో ఆకారం నిల్చొనివున్నట్లు అతనికి అనుమానంవేసింది. కారుని ముందుకుపోనిచ్చి ఆపి, దిగి సందులోకి ప్రవేశించబోయాడు. మాటలు వినిపిస్తున్నాయి మెల్లగా.

'ఏం ఇప్పుడైనా అంగీకరిస్తావా?' అడిగిందొక మగ కంఠం.

'ఛీ! దుర్మార్గుడా! నీయిష్టమొచ్చినట్లు చెయ్యి! నా కంఠంలో ప్రాణముండగా అంగీకరించను.' మొండిగా అంది ఆడగొంతు. అది నాగమణి కంఠంలా వినిపించింది రాజుకు.

'హుఁ! ఏంచేస్తానో తెలుసా? నన్ను కాలేజీనుండి డిబార్ చేయించినందుకు నిన్ను చంపాలని నిశ్చయించుకొని సమయంకోసం ఎదురుచూస్తున్నాను. అది ఇప్పుడు నెరవేరింది. నిన్ను నరికి ముక్కలుగాచేసి, మీ తండ్రికి పంపుతా! నిన్నెవరు రక్షిస్తారో చూస్తా?' భయంకరంగాపలికిన కంఠస్వరానికి రాజా నాగమణిని ఏం చేస్తాడోనని కంగారుపడ్డాడు.

'నేను రక్షిస్తా!' అంటూ ఆ ఆకారంపైకి ఎగిరాడు.

ఆ ఆకారం నాగమణిని బలంగా ఒక్కపోటు పొడవబోయింది. కాని రాజా అందుకు అవకాశం యివ్వకుండా ఆ చెయ్యిని బలంగా పట్టుకు ఆపి మెలితిప్పాడు.

తప్పనిసరిగా నాగమణిని వదలవలసివచ్చింది. నాగమణిని విడిచి రాజాతో కలియబడింది ఆ ఆకారం.

ఇద్దరూ హోరాహోరీగా పోట్లాడుతున్నారు. క్రిందామీదా పడుతున్నారు. గ్రుద్దుకుంటున్నారు. పడుతూ, లేస్తున్నారు. రాజా ఎక్కువగా ఆ ఆకారంచేతిలోని కత్తిని త్రుళ్ళగొట్టాలని ప్రయత్నిస్తున్నాడు.

రాజా ఉద్దేశ్యం కనిపెట్టిన ఆ ఆకారం, అంతకేమాత్రం అవకాశం ఇవ్వక రాజాని పొడవటానికి ప్రయత్నిస్తోంది.

నాగమణి భయంతో గోడని అంటిపెట్టుకొని నిలుచుని చూస్తోంది.

రాజా విజయం సాధించాడు. ఆకారం చెయ్యి జ

గాపట్టుగొని నొక్కి వెనక్కి త్రిప్పి కొట్టేసరికి కత్తి దూరంగా వెళ్ళి పడింది. ఆకారం కోపంగా రాజా మెడని రెండుచేతులతో నొక్కేయసాగింది. రాజా కాళ్ళెత్తి ఆకారం మెడకు కత్తెరపట్టు వేసి బిగించాడు. దానితో ఆకారం ఉక్కిరిబిక్కిరై తనపట్టు విడిచింది. వెంటనే రాజా ఆపట్టు అలా నేవుంచి, నడుంపై పిడికిలి బిగించి బలంగా గుద్దేసరికి 'అమ్మా!' అని అరిచింది ఆకారం. వెంటనే రాజా లేచి పట్టువిడిచి, చొక్కా పట్టుకు లేవదీశాడు ఆకారాన్ని. పిడికిలితో గెడ్డంక్రింద ఒక్కటిచ్చేసరికి చుట్టచుట్టుకు పడిందాకారం. ఆపడ్డంలో సరిగా వెళ్ళి కత్తివద్ద పడింది. కత్తిఅందుకొని కసిగా రాజాపై విసిరిందా ఆకారం. 'అమ్మా!' అంటూ రాజా నేల కూలాడు.

ఎవరెవరు కొట్టుకుంటున్నదీ నాగమణికి కనిపించలేదు చప్పుడుతప్ప. ఆమె తనరాజా ఏమయ్యాడోనని కంగారుపడసాగింది. 'అమ్మా!' అనే రాజా కేకకి రాజా! అంటూ పరుగెత్తబోయి రాయిపగిలి క్రిందపడింది.

ఆకారం రాజా క్రిందపడగానే వికటాట్టహాసం చేస్తూ, రాజాపైకి దూకింది. మరుక్షణం రాజా తప్పుకోవటంతో నేల కరుచుకుంది. రాజా లేచి, భుజానికి గ్రుచ్చుకున్న కత్తిలాగి పడేసి, ఆకారాన్ని గట్టిగా పట్టుకొని నిలబెట్టాడు. అతని పిడికిలిపోటు శరవేగంతోపోయి ఆకారం డొక్కలో గుచ్చుకొంది. మూలిగి ఆకారం క్రిందపడింది. వెంటనే లేపి మరొక గుద్దు గెడ్డం కింద యిచ్చాడు. త్రుళ్ళి గోడను ఢీకొందిసారి. కాలరుపట్టుకొని నిలబెట్టి 'బద్మాష్! చంపుతావ్?' అంటూ రెండు చేతులతో బలంగానడుంపైకొట్టి ముకుతో డొక్కలో పొడిచేసరికి కిక్కురుమనకుండా నేలకూలిందా ఆకారం.

రాజా క్రిందకువంగి ఆకారం ముక్కువద్ద వ్రేలుంచి చూచి, స్పృహ తప్పాడని తెలుసుకున్నాడు. జేబు నుండి రుమాలుతీసి రెక్కలు పెడివిరచి కట్టాడు. భుజాన్నుండి రక్తం కారుతోంది. చేత్తో అదుముకుంటూ 'నాగమణీ!' అంటూ చీకట్లో ఆమెకోసం వెదుక సాగాడు.

'రాజా! ఏమయింది? అమ్మా! అని అరిచారు' అంటూ నాగమణి రాజాను చేరి శరీరం తడమసాగింది కంగారుగా.

'అబ్బే ఏమవలేదు! కత్తి భుజంలో దిగింది అంతే' అన్నాడు.

నాగమణి చరున తన చీరెచించి ఆప్రదేశం తడిమి కట్టు కట్టింది. రాజా ఆకారాన్ని ఈడ్చుకుపోయి లైటు వెలుగులోచూచి, 'నువ్వా, విఠల్!' అన్నాడు.

కార్లోపడేసి, కారు స్టార్టుచేసి మెల్లగానడిపి ప్రకాశరావుగారింటిముందు ఆపాడు. నాగమణి తలుపు పిలిచింది. నౌకరు వెంకన్న తలుపుతీసాడు. రాజాతో నాగమణి లోనికి ప్రవేశించింది. వీరిద్దర్ని చూచి బెంబేలు పడిపోయాడు నౌకరు.

'అమ్మగోరూ! బాబుగోరూ! ఈరక్తమేంటి? ఈ మట్టేంటి? దెబ్బలేంటి?' కంగారుగా అడిగాడు.

'తర్వాత చెప్తాగాని, కార్లో ఒకవ్యక్తి వుంటాడు, తీసుకురా!' అని సోఫాలో కూర్చున్నాడు రాజా.

'బాబూ! అమ్మా!' అంటూ ప్రకాశరావు, రత్నమ్మగార్లను కేకేసి బైటకువెళ్ళాడు నౌకరు వెంకన్న.

వెంకన్న కేకలకు నిద్దురలోవున్న భార్యాభర్తలు త్రుళ్ళిపడిలేచి బైటకువచ్చారు. రక్తశిక్త దుస్తులతో, రేగిన కురులతో, నలిగినబట్టలతో సోఫాలో కూర్చున్న రాజాను, అతనికి దగ్గరలో నిలబడిన నాగమణినిచూచి కంగారుతో 'అమ్మా! మణీ! ఏమిటిది? రక్తమేమిటి? దుస్తులేమిటి? దెబ్బలేమిటి?' అడిగారు.

'ఇదంతా నావల్లనాన్నా!' అంది నాగమణి.

'నీవల్లా!' అర్థంగాక ప్రశ్నించి, 'ఇంత రాత్రివరకు ఎక్కడున్నావమ్మా?' అడిగారు తల్లిదండ్రులు.

'నళినీ పుట్టినరోజుగా! వారింటికి వెళ్ళివస్తుంటే ఇది జరిగింది' అని అంటూవుండగా వెంకన్న విఠల్ ని మోసుకొచ్చి పడేశాడు.

'అతడెవరు? ఆ కట్లేంటి?' అయోమయంగా అడిగారు ప్రకాశరావుగారు.

'ఇతనివల్లే ఇవన్నీ కలిగాయి! అవన్నీ తర్వాత మాటలాడుకుందాం. మీరు పోలీసుస్టేషనుకి ఫోను చేయండి!, అంటూ స్పృహతప్పినరాజా సోఫాలో ఒరిగిపోయాడు.

'రాజా!' అంటూ కంగారుగా అంతా చుట్టూ మూగారు.

'బాబుగారూ! రాజాగారు తెలివితప్పి పడిపోయారు! చల్లనినీళ్లు జల్లండి! తెలివివస్తుంది. నేవెళ్ళి డాక్టరుగార్ని తీసుకువస్తాను' అంటూ నీళ్ళగ్లాసు తెచ్చియిచ్చి, డాక్టరు కోసం వెళ్ళాడు వెంకన్న.

నాగమణి నీళ్లు చిలకరించి మొహం తుడిచి

డాక్టరువచ్చి కట్టుకట్టి వెళ్ళిపోయాడు. కొంత సేపటికి రాజాకు తెలివివచ్చింది. ఫ్లాస్కులోనుండి వేడికాఫీ గ్లాసులోపోసి అందించారు రత్నమ్మగారు. వేడికాఫీ త్రాగ్గానే ఎక్కడలేనిశక్తి అతనిలో ప్రవేశించింది. నిమ్మదిగా లేచి కూర్చున్నాడు రాజా.

ప్రకాశరావుగారు కుదుటపడి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశారు. 'హలో! పోలీస్ స్టేషన్!'

'యస్. పోలీస్ స్టేషన్! ఎవరు మాట్లాడేది?'

'లాయరు ప్రకాశరావు.'

'గుడ్ నైట్ సార్.'

'గుడ్ నైట్! ఇక్కడొక హత్యాప్రయత్నంచేసిన వ్యక్తి పట్టుబడ్డాడు. మీరు వెంటనే రావాలి ఇన్స్పెక్టర్!'

'వాట్ సార్, మీయింట్లో హత్యాప్రయత్నమా? నమ్మలేను. సరే, యిప్పుడే వస్తున్నా!' అంటూ ఇన్స్పెక్టర్ రిసీవర్ దించేసి నలుగురు కానిస్టేబుల్సుని తీసుకొని లాయరు ప్రకాశరావుగారిల్లు చేరుకున్నాడు.

'మిస్టర్ యిన్స్పెక్టర్! అతడే హంతకుడు! పేరు విఠల్! హత్యాప్రయత్నం మా అమ్మాయిపై' అన్నారు ప్రకాశరావుగారు.

రాజావల్ల అంతా తెలుసుకొని, వివరాలు వ్రాసుకొని విఠల్‌ని అరెస్టుచేసి తీసుకుపోయారు ఇనస్పెక్టరు.

'రాజా! ఆజన్మాంతం నీకు మేం కృతజ్ఞులం!' అనారు ప్రకాశరావు.

'నోనో సర్! నాకర్తవ్యం నెరవేర్చానంతే! దానికింత పొగడ్తలెందుకు. చూడండి, మీతో చాలారోజుల నుండి ఒకవిషయం మాట్లాడుదామనుకుంటున్నాను. సమయంరాలేదు. ఇప్పుడు వచ్చింది. మీ అమ్మాయిని నేను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను మీకు అభ్యంతరం లేకపోతే' అన్నాడు రాజా. అలా అనేసరికి నాగమణి సిగ్గుపడి మేడపైకి వెళ్ళిపోయింది.

'ఆసంగతి నాకెప్పుడో తెల్సురాజా!' తాపీగా అన్నారు ప్రకాశరావుగారు.

'తెలుసా?' ఆశ్చర్యంగా అడిగాడు రాజా.

'తెలుసు! మణి పుస్తకంలో నీ ఫోటో చూసినప్పటి నుండి ఎప్పుడో ఒకరోజున నీవే బయట పెడతావను

మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు దీపావళి అభినందనలు.

దీపావళి పండుగకు

ప్రభాత్ బనియన్లు

కొని ధరించి ఆనందించండి.

*

* చక్కని అల్లిక * నాణ్యములకు

* సరియైన సైజులు ప్రసిద్ధిచెందినది.

ఆంధ్రప్రదేశమంతటనూ జిల్లాలవారీగా

డిపాజిట్టు కట్టగల ఏజెంట్లు కావలెను.



తయారించువారు

PRABHAT HOSIERY
3/27, Kangeyam Road,
TIRUPUR-4.

హైదరాబాదు ఏజెంట్లు

DWARAKA TEXTILES AGENCY
4—4—260, Sultan Bazaar,
HYDERABAD (A.P.)

కున్నాను. ఆసమయం ఇప్పు డొచ్చిందన్నమాట! సరే, మీ తల్లిదండ్రు లెవరు? ఏం చేస్తుంటారు?' కుతూహలంగా ప్రశ్నించారు.

'మా తల్లిపేరు సీతామహాలక్ష్మమ్మ. తండ్రి రామచంద్రరావుగారు. కాకినాడలో జమీందారు.'

'అరే! జమీందారు రామచంద్రరావుగారి అబ్బాయివా? ఆమాట ఇదివరకే తెలుపలేదేమయ్యా! ఆయన నేను ప్రాణస్నేహితులం కదా!' అన్నారు.

'ఏమిటీ? మీరిద్దరూ ప్రాణస్నేహితులా? నాకీసంగతే తెలియదు' అన్నాడు రాజా.

'కొన్ని కారణాలవల్ల మేం విడిపోయి దూరంగా వెళ్ళవలసివచ్చింది. ఆ విడిపోవటం విడిపోవటం_ మరి కలవడంజరగలేదు. అప్పటికి నువ్వు చాలా చిన్నవాడివి. ఎలాగయితేనేం మళ్ళీ కలిసే అదృష్టం వుంది. లేకపోతే ఏమిటిది? మీయిద్దరికి అప్రయత్నంగా పరిచయం జరగటం, వివాహం చేసుకోవాలని నువ్వు అనుకోవటం, చాలా విచిత్రంగావుంది కదూ! ఈవిధంగా మా పాత స్నేహితులం తిరిగి కలుసున్నాం. నా స్నేహితునితో వియ్యమందటమంటే నాకెంతో సంతోషంగా వుంది. త్వరలోనే ముహూర్తం పెట్టిస్తా!' అన్నారు ఆనందంగా ప్రకాశరావుగారు.

నాగమణి డ్రెస్ మార్చుకొనివచ్చింది. ప్రకాశరావుగారు 'అమ్మా! రాజాకు పరుండటానికి ఏర్పాటు చేయించు వస్తా' అంటూ వెళ్ళిపోయారు. ఆయనవెంట రత్నమ్మగారుకూడా వెళ్ళారు.

నాగమణి రాజాకుదగ్గరగా కూర్చొని 'రాజా! ఆసమయానికి మీరే రాకపోతే నాగతేమయ్యేదో?' అంది కన్నీరు పెడుతూ.

'ఛ ఛ! కన్నీరు పెడుతున్నావా మణీ? నేను కాకపోతే నాలాంటివారెవరైనా నిన్ను కాపాడుతారు. సరే కాని, నీపై అంత కక్షెందుకు విఠల్‌కి?' అని ప్రశ్నించాడు రాజా.

'ఏం చెప్పను? వాడు నన్ను ప్రేమిస్తున్నానని లేఖ వ్రాసి అందించాడు. ఎక్కడికైనా పారిపోదామన్నాడు. వాడిపై అసహ్యం, కోపం కలిగాయి. గట్టిగా బుద్ధి చెప్పాలనుకున్నాను. బాగాఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాను. దాంతో బుద్ధొచ్చి సరిగా మసలుకుంటాడే తప్ప, ఇలా కక్ష పెంచుకుంటాడనుకోలేదు. దుర్మార్గుడు. మర్నాడు రోడ్డుపై కలుసుకొని 'జవాబు' అడిగాడు. చెంప చెళ్ళుమనిపించాను. దాంతో దవడ సరిజేసుకుంటూ వెనుదిరిగిపోయాడు. కాలేజీ చేరగానే ప్రిన్సిపాల్ గారికి లేఖ చూపించి, వివరంగా చెప్పాను. విఠల్‌ని రావించి అడిగారు.

'ఈలేఖ నీవు వ్రాసిందేనా?' అని ప్రిన్సిపాల్ గారి మొదటిప్రశ్న.

'కాదుసార్' బొంకాడు.

'మరి?'

'నాకు తెలియదుసార్!'

'నువ్వు లవ్ లెటర్ వ్రాశావని ఈ అమ్మాయి రిపోర్టు చేసింది. దానికి నీసమాధానం?' ప్రశ్నించారు.

'నేనా? ఈ అమ్మాయి ఎవరో తెలియదు సార్! అలాంటప్పుడు లవ్ లెటరు ఎలా ర[illegible]ను?' అని ఎదురు ప్రశ్న వేశాడు.

'సరే అమ్మాయ్! అతను కాదంటున్నాడు! నీ విచ్చే జవాబు?' నన్ను చూస్తూ అనిగారు ప్రిన్సిపాల్.

'రాసాడు సార్! కాదంటే ఇందాకే చెంప పగులగొట్టాను. ఆగుర్తులు చూడండి' అన్నాను నేను.

విఠల్ చెంపపై వేళ్ళు గుర్తులున్నాయి.

'కాదుసార్! ఇందాక ఫ్రెండ్సు తగవులాడుకుంటున్నాం! దానిఫలితం ఇది. ఆమె ఇలా మార్పు చేస్తోంది.' అన్నాడు ధైర్యంగా.

'సార్, అతనే అబద్దమాడుతూ కప్పిపుచ్చాలని ప్రయత్నిస్తున్నాడు' అని తీవ్రంగా అన్నాను నేను.

'వాటీజ్ దిస్? ఎవరికి వారే కాదంటున్నారు' అని విసుక్కొని ఒకనిముషం ఆలోచించారు. ఏదో స్ఫురించింది ఆయనకు. 'సరే మీరిద్దరూ ఈకాగితముపై సంతకాలు చెయ్యండి' అన్నారు తెల్లకాగిత మొకటిస్తూ.

ఇద్దరూ సంతకాలు చేశారు.

ప్రిన్సిపాల్ ఆకాగితం_ తీసుకొని వారిసంతకాలతో ఆ లవ్ లెటర్‌లోని దస్తూరీతో పోల్చిచూసారు. ఆయన మొహం ఎర్రగా కందింది. కోపం మితిమీరింది. ఉగ్రరూపం దాల్చారు.

'మిస్టర్ విఠల్! చెయ్యకూడనిపని చేశావు! క్షమించమంటే వార్నింగుతోపోయేది. పైగా అబద్దమాడి నన్ను నమ్మించటానికి ప్రయత్నించావ్! ఒక నేరమల్లా రెండు నేరాలుగా పరిణమించాయి.' గర్జించారు ప్రిన్సిపాలు గారు.

తనకు శిక్ష ఎలాగూ తప్పదని భావించుకున్న విఠల్ ప్లేటు ఫిరాయించి 'అందితే జుట్టు _ అందకపోతే కాళ్లు' అన్నట్లుగా_'సార్! క్షమించండి! తప్పయింది. ఇంకెప్పుడూ ఇలాంటిపని చేయను' అని దీనంగా నటిస్తూ అన్నాడు.

'క్షమించాలా నిన్ను! దేనికి? ఒక అమ్మాయికి వుత్తరం రాసినందుకా? లేక నన్ను నమ్మించ ప్రయత్నించినందుకా?' అడిగారు.

(సశేషం)